ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
ఆదివారం | సెప్టెంబరు 20, 2026 | సంపుటి : 7 | సంచిక : 94 | పేజీలు : 2

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

- విచారణకు అనుమతిస్తే.. హైకోర్టు తీర్పుపై అప్పీల్ చేసే అవకాశం
- ఇప్పటికే కేవియట్ పిటిషన్ వేసిన ఎమ్మెల్యేలు ఏలేటి, పాడి కౌశిక్ రెడ్డి


2లో

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

### ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్

### మామునూరు విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియ ముమ్మరం




**మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.**

**వరంగల్, ఆయుధం**

వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే.

బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.

ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

**పర్యావరణ అనుమతులే ఆలస్యం**

రేవంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.



పేదల ఇండ్లకు

## పట్టాలివ్వండి

- మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ నగరంలోని సర్వే నంబర్ 964, 966, దీన్ దయాల్ నగర్, బంధం చెరువు, కోట చెరువు, ఇందిరమ్మ కాలనీల లో గత అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న సుమారు 1000 మంది నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ప్రతినిధి బృందం శనివారం హైదరాబాదులోని మంత్రి పొంగులేటి నివాసంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ నాయకులు కిషోర్, అలకుంట్ల మల్లన్న, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, జోగుదుర్గ, కనకం కావ్య తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, ఇల్లు లేనటువంటి నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పక్క గృహాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.



## విఘ్నాలు తొలగించే భగవంతుడు గణనాథుడు

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, ఆయుధం:** విఘ్నాలు తొలగించే దేవుడు గణనాథుడని బల్దియా ప్రత్యేక అధికారి/ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. శనివారం నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలో ప్రతిష్టించిన గణనాథుని వద్ద కలెక్టర్,కమిషనర్ టి.వెంకన్న ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే విఘ్నదిపతి గణనాథుడని, వినాయకుణ్ణి పూజించడం వల్ల అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని నమ్మకం అని నక్కల గుట్ట సర్కిల్ కార్యాలయంలో ప్రతి సంవత్సరం వినాయకుణ్ణి ప్రతిష్టించి మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భం గా నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్



ఇంజనీర్ రాజ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ బిరు శ్రీనివాస్, ఈఈ లు రవి కుమార్, మహేందర్, మాధవి లత, డిఈలు రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, ఏఈ హరి కుమార్, కార్యాలయ సిబ్బంది కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ పవిత్రత దెబ్బతినకుండా

## అభివృద్ధి పనులు చేపట్టండి



- త్వరలో మల్లూరు క్షేత్రంలో పర్యటించి అభివృద్ధి పనుల డిజైన్ ఖరారు చేయాలని నిర్ణయం
- కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం సౌకర్యాల అభివృద్ధికి చర్యలు
- మల్లూరు దేవాలయ అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క సమీక్ష

**ములుగు, ఆయుధం:**

ములుగు జిల్లాలోని ప్రసిద్ధ మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దేవాలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు ప్రముఖ ఆర్కిటెక్టులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, మల్లూరు క్షేత్ర ప్రాశస్త్యం, చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులలో భాగంగా కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం వంటి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడంపై సమావేశంలో చర్చించి, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

అదేవిధంగా, దేవాలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదా డిస్టర్బెన్స్ కలగకుండా, క్షేత్ర పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణ స్వరూపం, పరిసర ప్రాంతాల ప్రత్యేకత, భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆర్కిటెక్టులు, అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్‌ను ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం దేవాలయ అభివృద్ధికి అనువైన డిజైన్‌ను ఖరారు చేయనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి భూమి స్థితిగతులు, నిర్మాణ సామర్థ్యం తదితర అంశాలను నిర్ధారించేందుకు రాక్ టెస్ట్‌ను త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించారు. రాక్ టెస్ట్ నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, సమన్వయంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు.




### కిట్స్ కాలేజ్ సర్కిల్ అభివృద్ధి పనులను

## వేగవంతం చేయాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న

**హనుమకొండ, ఆయుధం:** హన్మకొండలోని కరీంనగర్ ప్రధాన రహదారి కిట్స్ కళాశాల జంక్షన్ అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ జంక్షన్ అభివృద్ధి చేయనున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ పనులతో పాటు ఫుట్ పాత్‌లు, ఐలాండ్‌ల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు అభివృద్ధి, జంక్షన్ సుందరీకరణ తదితర పనులను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. టెండర్ ప్రక్రియ పూర్తైనందున ఎలాంటి జాప్యం లేకుండా పనులను ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. జంక్షన్ అభివృద్ధితో వాహనదారులు, పాదచారులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రాంతానికి మరింత ఆకర్షణీయమైన రూపాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలనలో కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారం కోల్పోయామనే అక్కసుతోనే

## బీఆర్ఎస్ ఆరోపణలు



- బీఆర్ఎస్ నాయకులు, కల్వకుంట్ల కుటుంబం ఏ రకంగా పేదల భూములను ఆక్రమించుకున్నారో అసెంబ్లీ సాక్షిగా సీఎం తెలిపారు
- తెలంగాణ పేరు చెప్పుకొని వందల ఎకరాలు సంపాదించుకున్నారు
- 2014 ఎన్నికల అఫిడవిట్ లో ఒక్క ఎకరం కూడా లేని మీకు వందల ఎకరాలు ఎలా వచ్చాయి?
- నీతిమంతులే అయితే నిజాయితీ నిరూపించుకోవాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘనపూర్, ఆయుధం:** కేసీఆర్ కుటుంబానికి 2014లో ఉన్న ఆస్తులు ఎన్ని 2024లో ఉన్న ఆస్తులు ఎన్నో తెలంగాణ ప్రజలకు చెప్పాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేశారు. (వివరాలు 2లో..)



## ఎంపీల్యాడ్స్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** ఎంపీల్యాడ్స్ నిధులతో జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీలాడ్స్ )ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, టీజీఐడీసీ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులలో పురోగతిలో ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. మిగతా అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజుల్లో ఎంపీల్యాడ్స్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ దేవిక చౌహాన్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గాయత్రి, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్ రావు, డీఈలు శ్రీనివాస రావు, శిరీష, యుగంధర్, రామ్ దేవ్, కన్సల్టెంట్ టెక్నికల్ నరేందర్ రెడ్డి, టీజీఐడీసీ ఏఈ ఎండీ. అజీజ్ ఖాన్, పంచాయతీ రాజ్ ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వినాయక నిమజ్జనానికి

## పటిష్ట ఏర్పాట్లు

- బల్దియా కమిషనర్ టీ.వెంకన్న
- నిమజ్జన కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

2లో

# కమల గణనాథుడికి 108 ప్రసాదాలతో నైవేద్యం



**వరంగల్, ఆయుధం:** నగరంలోని సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది రజతోత్సవ వేదుకలుగా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. సంస్థ అధినేత గంట రవికుమార్ సారథ్యంలో 2001లో ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు ఈ ఏడాదితో విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో కొలువుదీరిన కమల గణనాథుడికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తున్నారు. 25 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు కమల గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక నైవేద్య కార్యక్రమంలో భక్తులు, విద్యార్థులు, సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ సిబ్బంది, నగర ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గంట రవి కుమార్ మాట్లాడుతూ, 2001లో ప్రారంభమైన గణనాథుడి ఉత్సవాలు నేడు 25వ సంవత్సరానికి చేరుకోవడం భగవంతుడి ఆశీస్సులతో పాటు విద్యార్థులు, భక్తులు, నగర ప్రజల సహకారంతోనే సాధ్యమైందన్నారు. ప్రతి ఏడాది వినూత్న రీతిలో గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం తమకు ఎంతో ఆనందంగా, అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ అధినేత గంట రవికుమార్ తెలిపారు.




# ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

**పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్**



**వరంగల్, ఆయుధం:** వరంగల్, హన్మకొండ, కాజీపేట ట్రై సిటి పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐ.పి.ఎస్. వెల్లడించారు. ఈనెల 23 ఉదయం 10:00 గంటల నుండి 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయి.

**భారీ వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు,**

- ములుగు-భూపాలపల్లి వైపు నుండి వచ్చు భారీ వాహనములు హైదరాబాద్ కు వెళ్ళవలసినవి ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుండి వెళ్ళవలెను.
- భూపాలపల్లి-పరకాల నుండి ఖమ్మం వెళ్ళవలసినవి ఆరేపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి కరుణాపురంవెంకటాపురం ఐనవోలుపున్నేలు క్రాస్ రోడ్ వద్ద ఖమ్మం రోడ్ ఎక్కి వెళ్ళవలెను.
- భూపాలపల్లి-పరకాల నుండి వచ్చు భారీ వాహనాలు నర్సంపేట వైపు వెళ్ళవలసినవి కొత్తపేటరెడ్డిపాలెంజాన్పరలు గొర్రె కుంట నుండి వెళ్ళవలెను.
- కరీంనగర్ నుండి ఖమ్మం వైపు వెళ్ళు భారీ వాహనాలు చింతగట్టు వద్ద ORR పైకి వెళ్లి Uటర్న్ తీసుకొని కరుణాపురంవెంకటపూర్ ఐనవోలు పున్నేలు క్రాస్ రోడ్ వద్ద ఖమ్మం రోడ్కు ఎక్కి వెళ్ళవలెను.
- ఖమ్మం నుండి కరీంనగర్ హైదరాబాద్ వైపు వెళ్ళు భారీ వాహనాలు పున్నేలు క్రాస్ రోడ్, ఐనవోలు ఆర్చ్ వెంకటపూర్ కరుణాపురం మీదుగా వెళ్ళవలెను.
- హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్లు భారీ వాహనాలు కరుణాపురం వెంకటపూర్ ఐనవోలుపున్నేలు క్రాస్ రోడ్ నుండి ఖమ్మం వెళ్ళవలెను.
- సిటి లోపలికి వచ్చు భారీ వాహనములు సిటి అవతల ఆపుకోవలెను. నిమజ్జన సమయంలో ఎలాంటి వాహనములు సిటి లోపలికి అనుమతించబడవు.
- హైదరాబాద్ నుండి నర్సంపేట వైపు వెళ్లు భారీ వాహనాలు కరుణాపురం నుండి ORR మీదికి వచ్చి ఆరేపల్లి వద్ద వయా ఆత్మకూరు, కటాక్షపూర్, మల్లంపల్లి, మీదుగా నర్సంపేట వెళ్ళవలెను.
- నర్సంపేట వైపు నుండి వరంగల్, హైదరాబాద్ వెళ్లు భారీ వాహనాలు వయా మల్లంపల్లి, కటాక్షపూర్ ఆత్మకూరు, ఆరెపల్లి ORR మీదుగా వెళ్ళవలెను.

**వరంగల్ నగరంలో తిరుగు అన్ని రకాల వాహనాలకు ట్రాపిక్ ఆంక్షలు**

- ములుగు మరియు పరకాల వైపు నుండి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుండి కెయుసి, సి.వి.పి. అంబేద్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవి మాల్ మదుగా బస్టాండ్కు చేరుకోవాల్సి ఉంటుంది.
- హన్మకొండ బస్టాండ్ నుండి బయలుదేరి ములుగు వైపు, కరీంనగర్ వైపు వెళ్ళు బస్సులు వయా ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేద్కర్ సెంటర్, సి.పి.ఓ ద్వారా కెయుసి, జంక్షన్ మీదుగా వెళ్ళవలెను.
- హన్మకొండ బస్టాండ్ నుండి బయలుదేరి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్ళు బస్సులు వయా బాలసముద్రం, అదాలత్, హంటర్ రోడ్ మీదుగా వెళ్ళవలెను.
- వరంగల్ బస్టాండ్ నుండి హన్మకొండ వైపు వచ్చు బస్సులు చింతల్ బ్రిడ్జి నుండి రంగశాయిపేట్ మీదుగా నాయుడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సుగుట్ట, అదాలత్, బాలసముద్రం రోడ్ మీదుగా హన్మకొండకు చేరుకోవాలి.
- ఖాజీపేట నుండి వరంగల్ వైపు వెళ్ళవలసిన, కార్లు ఇతర చిన్న వాహనాలు ఫాతిమా జంక్షన్, వడ్డేపల్లి చర్చి, K.U.C జంక్షన్, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు, MGM, జెమిని, పోతన జంక్షన్, అండర్ బ్రిడ్జి, హెడ్ పోస్టాఫీసు, వరంగల్ బస్టాండ్, వెంకట్రామ సర్కిల్ మీదుగా వెళ్ళవలెను.
- వరంగల్ వైపు నుండి ఖాజీపేట వైపు వెళ్ళవలసిన, కార్లు మరియు ఇతర చిన్న వాహనాలు వెంకట్రామ్వరంగల్ బస్టాండ్ హెడ్ పోస్టాఫీసు అండర్ బ్రిడ్జి పోతన జంక్షన్ జెమినిMGM ములుగు రోడ్డుపెద్దమ్మగడ్డ K.U.C జంక్షన్ వడ్డేపల్లి చర్చి పాతిమా జంక్షన్ మీదుగా వెళ్ళవలెను.

**వినాయక నిమజ్జన వాహనాలకు ట్రాఫిక్ అంక్షలు:-**

- సిద్ధేశ్వర గుండములో నిమజ్జనం చేసిన తరువాత వాహనాలు శాయంపేట వైపు వెళ్ళ రోడ్డు ద్వారా వెళ్ళవలెను.
- శాయంపేట వైపు నుండి వచ్చు వినాయక విగ్రహా వాహనాలు వయా హంటర్ రోడ్, అదాలత్, హన్మకొండ చౌరస్తా మీదుగా ప్రయాణించవలెను.
- ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలని మరియు వడ్డేపల్లి ప్రాంతాల నుండి వచ్చే వినాయక విగ్రహాలు అన్ని బంధం చెరువులో నిమజ్జనం చేయవలెను.
- చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేసిన వాహనాలు ఎనుమాముల రోడ్ నుండి నర్సంపేట రోడ్ వైపునకు వెళ్ళవలెను.
- నిమజ్జనం రోజున శోభా యాత్ర వెళ్ళే, మార్గములో మరియు నిమజ్జనం జరిగే ప్రదేశంలో వాహనాలు నిలుపరాదు మరియు ప్రజలు అందరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరిచగలరు.

# అధికారం కోల్పోయామనే అక్కసుతోనే బీఆర్ఎస్ ఆరోపణలు

- బీఆర్ఎస్ నాయకులు, కల్వకుంట్ల కుటుంబం ఏ రకంగా పేదల భూములను ఆక్రమించుకున్నారో అసెంబ్లీ సాక్షిగా సీఎం తెలిపారు
- తెలంగాణ పేరు చెప్పుకొని వందల ఎకరాలు సంపాదించుకున్నారు
- 2014 ఎన్నికల అఫిడవిట్ లో ఒక్క ఎకరం కూడా లేని మీకు వందల ఎకరాలు ఎలా వచ్చాయి?
- నీతిమంతులే అయితే నిజాయితీ నిరూపించుకోవాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘనపూర్, ఆయుధం:** కేసీఆర్ కుటుంబానికి 2014లో ఉన్న ఆస్తులు ఎన్ని 2024లో ఉన్న ఆస్తులు ఎన్నో తెలంగాణ ప్రజలకు చెప్పాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మిషాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... తెలంగాణ పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల కుటుంబం 10ఏళ్లలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని వందల ఎకరాల భూమిని ఆక్రమించుకురాని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు ధరణిని అడ్డంపెట్టుకొని ఏ రకంగా పేదల భూములను ఆక్రమించుకున్నారో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వివరాలతో సహా వెల్లడించారాని తెలిపారు. కేసీఆర్ కుటుంబానికి 2014ఎన్నికల అఫిడవిట్ లో ఒక్క ఎకరం లేదని చెప్పి 2024 వచ్చే సరికి వందల ఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులన్నీ కూడా అధికారాన్ని అడ్డంపెట్టుకొని అక్రమంగా సంపాదించినవే అని ఆరోపించారు. 2014కు ముందు మీ ఆస్తులు ఎన్ని ఇప్పుడు మీ ఆస్తులు ఎన్నో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజంగా మీరు నీతిమంతులే అయితే 2014 లో ఉన్న ఆస్తులు ఎన్ని 2024లో ఉన్న ఆస్తులు ఎన్ని....? ఆ ఆస్తులు ఎలా వచ్చేయో తెలంగాణ ప్రజలకు చెప్పి నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా 1600కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుంటే కొంతమంది కళ్ళకు కనిపించడం లేదని విమర్శించారు. 15ఏళ్ళు ఎమ్మెల్యే గా ఉన్న వ్యక్తి ఏం చేశాడో ప్రజలు ఆలోచించాలని తెలిపారు. చిల్లర పనులు, చిలిపి చేష్టలతో, అవినీతి, అక్రమాలతో నియోజకవర్గ పరువు తీశాడని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని అలా ఎవరైనా అడిగితే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎల్ నీనో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో వానాకాలం పంటలకు సరిపడే నీళ్లు ఉన్నాయని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. 20ఏళ్ల క్రితం చిన్న మొక్కగా నాటిన దేవాదుల ప్రాజెక్ట్ నేడు మహా వృక్షంగా ఎదిగి ఉమ్మడి జిల్లాకు సాగు, త్రాగు నీరు అందించే వరప్రదాయినిగా ఎదిగిందని కొనియాడారు. వారం రోజులలో కాలువల ద్వారా సాగు నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడివో, వివిధ శాఖల అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవానికి కార్యాచరణ

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో పర్యాటక శాఖ వివిధ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 27న నిర్వహించే ప్రపంచ దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ,డిఐఈఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 6:00 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాలు, 25వ తేదీన హనుమకొండ పద్మాక్షి జైన దేవాలయం, సిద్దేశ్వరాలయం వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు.

హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. 26వ తేదీన ఉదయం 7 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టే కార్యక్రమాలను ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా అటవీ శాఖ అధికారి ముకుంద రెడ్డి, డీఈవో గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహ రావు, అడిషనల్ డీఆర్డీఏ వెంకటేశ్వర్లు, జీడబ్ల్యూఎంసి సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఇరిగేషన్ ఈఈ మంగీ లాల్, డీఐఈవో గోపాల్, కేంద్ర పురావస్తు అధికారి అజిత్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడలు

**వరంగల్, ఆయుధం:** జిల్లా పరిషత్ హై స్కూల్ సుందరయ్య నగర్ వరంగల్ నందు 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ జోన్ ఆధ్వర్యంలో రెండవ రోజు 14 సంవత్సరాల బాలబాలికల కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడలకు సెలక్షన్స్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు వై.మంజుల క్రీడలను ప్రారంభించారు. దాదాపు 400 మంది బాలబాలికలు 38 పాఠశాలల నుంచి హాజరయ్యారు. వారిలో అత్యంత ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఎంపిక చేశారు. ముగింపు కార్యక్రమానికి వరంగల్ మండల విద్యాశాఖ అధికారి సాధం వెంకటేశ్వరరావు, ఖిలా వరంగల్ మండల విద్యాశాఖ అధికారి కాట్రాజు వెంకటయ్య, సుందరయ్య నగర్ ప్రధానోపాధ్యాయురాలు వై.మంజుల హాజరై, క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన వరంగల్ జోనల్ క్రీడల కార్యదర్శి బి.రవీనా, రెండు మండలాల పీడీలు, పీఈటీలను వారు అభినందించారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు

- బల్దియా కమిషనర్ టీ.వెంకన్న
- నిమజ్జన కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశం



**వరంగల్, ఆయుధం:** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆదివారం లోగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం నగర పరిధిలోని మడికొండ చెరువు, బంధం చెరువు, సిద్దేశ్వర గుండం, ఉర్సుగుట్ట చెరువు, బేస్తం చెరువు, అగర్తల చెరువు, కట్టమల్లన్న చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువు, ముచ్చర్ల చెరువు, హసన్‌పర్తి, భీమారం చెరువు తదితర నిమజ్జన ప్రాంతాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, పారిశుద్ధ్య చర్యలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఐదవ రోజు నుంచే వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ముందస్తు చర్యలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. చెరువుల్లో మిగిలి ఉన్న గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సిబ్బందిని ముందుగానే కేటాయించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

విగ్రహాల నిమజ్జనానికి వినియోగించే క్రేన్లకు అవసరమైన ఇంధనాన్ని ముందస్తుగా సమకూర్చుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఇంజనీరింగ్, ఆర్అండ్‌బీ, డీఆర్ఎఫ్, మైనింగ్, మత్స్య తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు కల్పించాలని ఆదేశించారు. చెరువుల వద్ద తెప్పలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేలా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. నిమజ్జన కేంద్రాల్లో ప్రజల రద్దీ, వాహనాల రాకపోకలు, భద్రతా పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వెలుతురు తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఆరోగ్యాధికారి డా. రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంజయ్‌కుమార్, మహేందర్, సంతోష్‌బాబు, మాధవీలత, డీఈ రాజ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, ఏఈ హరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్



**హైదరాబాద్, ఆయుధం:** హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ శనివారం మధ్యాహ్నం సుప్రీంకోర్టు లో ఎస్‌ఎల్‌పీ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అనుమతిస్తుందా? లేదా? అనేది వేచిచూడాల్సి ఉంది. సర్వోన్నత న్యాయస్థానం ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ దానం నాగేందర్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి అప్పీలు దాఖలుకు అనుమతిస్తే.. హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ అప్పీలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే కేసులో ఇప్పటికే బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేవియట్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

# ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

- 28, 29, 30 తేదీలలో వార్షికోత్సవ వేడుకలు
- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**హనుమకొండ, ఆయుధం:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, హనుమకొండ వేదికగా సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న ఘనమైన రాష్ట్ర స్థాయి వార్షికోత్సవ వేడుకలను విద్యార్థి లోకం విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఏదునూరి వెంకట్రాజం అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ హనుమకొండ వేదికగా రాష్ట్ర స్థాయి ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. దేశంలో విద్యార్థి హక్కులు, ఉచితనాణ్యమైన విద్య, నిరుద్యోగ నిర్మూలన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ చరిత్రలో ఈ 90వ వార్షికోత్సవం ఎంతో చారిత్రాత్మకమైనదని తెలిపారు. విద్యార్థులు, యువకులు, ప్రగతిశీల వాదులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ వేడుకలకు హాజరై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కర్రె బిక్షపతి, సిరబోయిన కరుణాకర్, తోట బిక్షపతి, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, ఉట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉట్కూరు ప్రణీత్ గౌడ్, భాష బోయిన సంతోష్, దిడ్డి పార్థసారథి, ల్యాదెల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ 90 వార్షికోత్సవాల స్ఫూర్తి బ్యానర్ ను జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

# గణపతి మండపంలో కూచిపూడి నృత్యాలు



**వరంగల్, ఆయుధం:** వరంగల్ రంగసాయిపేటలోని రుద్రమ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో శనివారం సిల్వర్ క్రౌన్ స్కూల్ విద్యార్థులచే పసుపులేటి బిందుమతి శిష్య బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రమ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అందరూ కలిసి విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. అనంతరం బిందుమతి ని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రుద్రమ నగర్ గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పసుపులేటి హనుమంతరావు, కర్ణ వేణుగోపాల్, కొంగరి లక్ష్మీనారాయణ, బత్తుల సుదర్శన్, కొంతం వెంకన్న, బోడ కృష్ణ, మట్టపల్లి దేవేందర్, ఆకుల మహేందర్, రాచమల్ల రాజేష్, సతీష్, పసుపులేటి పూర్ణచందర్, గుండు దిలీప్ కుమార్, పోగుల సుతేజ్, సిద్ధార్థ, కుశాల్, రాజ్ కుమార్, బోగోజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695